సాక్షి
నంద్యాల
మంగళవారం । 9 । జనవరి । 2024




ఉమామహేశ్వరుడికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణ చేట్టారు.



పోస్టులన్నీ భర్తీ..

వైద్యారోగ్యశాఖలో పోస్టులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అందుతున్నాయి. 8లో



ఆంత్రాక్స్‌పై అప్రమత్తం

ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో ఇటీవల ఆంత్రాక్స్ వ్యాధి వెలుగుచూసింది. దీంతో పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యులు సూచిస్తున్నారు. 8లో▸

పారిశ్రామిక వికాసానికి నూతన రైలు మార్గం

- దూపాడు నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు కొత్త రైల్వే లైన్
- 40 కిలోమీటర్ల మేర వేసేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- మంత్రి బుగ్గన విన్నపం మేరకు సర్వేకు అంగీకారం
- టెండర్లను పిలిచిన రైల్వే శాఖ
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మంచి రోజులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు మౌలిక సదుపాయాలు కల్పించింది. నీటి సమస్యకు కూడా పరిష్కారం చూపింది. పారిశ్రామికవేత్తలు భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయాన్ని ప్రారంభించింది. కొత్త రైలు మార్గం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించింది. టెండర్లు పూర్తయి త్వరలోనే కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు సర్వే పనులు ప్రారంభం కానున్నాయి.

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ 9,900 ఎకరాల్లో ఏర్పాటవుతోంది. హైదరాబాద్–బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఈ ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం నోడ్ పాయింట్‌గా గుర్తించింది. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలు పరిశ్రమల ఏర్పాటు తుది దశకు వచ్చింది. ఈ క్రమంలో పారిశ్రామిక వికాసానికి అవకాశం ఉన్న ఓర్వకల్లు మీదుగా రైలు మార్గం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తీసుకెళ్లారు. ఢిల్లీ వెళ్లిన ప్రతి సారీ నూతన రైలు మార్గం కోసం అభ్యర్థించారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం కర్నూలు సమీపంలోని దూపాడు రైల్వేస్టేషన్ నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు రైలు మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ముందుగా రైల్వే మార్గం కోసం సర్వే చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రైల్వే శాఖ టెండర్లను ఆహ్వానించింది. త్వరలోనే సర్వే మొదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పారిశ్రామికీకరణకు పెద్ద ఊపు

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్రం దృష్టి సారించింది. నీటి సరఫరా కోసం రూ.450 కోట్లను ఖర్చు చేసి ముచ్చుమర్రి నుంచి పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపడుతోంది. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు అందుబాటులోకి తీసుకురావడంతో భవిష్యత్‌లో ఎయిర్ కార్గోకు అవకాశం ఉంటుంది. ఇదే సమయంలో నూతన రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఉత్సాహం నెలకొంది. రైల్వే సదుపాయం అందుబాటులోకి వస్తే ఇక్కడి పరిశ్రమల్లో ఉత్పత్తి అయిన వాటిని నేరుగా ప్రత్యేక రైల్వే సైడింగ్ ద్వారా తరలించేందుకు అనువుగా ఉంటుంది. కొత్త రైల్వే లైన్ పారిశ్రామికీకరణకు పెద్ద ఊపును తెస్తోందని పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు.



40 కిలోమీటర్ల మేర కొత్త మార్గం

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన నూతన రైలు మార్గం దూపాడు నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు ఉంటుంది. ఈ దూరం దాదాపు 40 కిలోమీటర్ల మేర ఉంటుందని భావిస్తున్నారు. ఈ మార్గంలో ఎలాంటి నదులు, పెద్ద వంతెలు, అటవీ ప్రాంతం లేకపోవడంతో రైల్వే లైన్ ఏర్పాటుకు అవకాశాలు అధికంగా ఉన్నాయి.

జాతీయ రహదారుల అనుసంధానం

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌ను అనుసంధానిస్తూ పలు జాతీయ రహదారుల నిర్మాణాలు కూడా వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం 40వ నంబర్ జాతీయ రహదారిలో ఓర్వకల్లు ఉంది. ఈ రహదారి చెన్నై–సూరత్ ఆరు లేన్ల జాతీయ రహదారితో అనుసంధానం కానున్నది. దీంతో ఇక్కడి నుంచి చెన్నై, సూరత్‌ల వరకు పారిశ్రామిక ఉత్పత్తులను తరలించడానికి అనువుగా ఉంటుంది. అలాగే కర్నూలు నుంచి ఆత్మకూరు వరకు 343సీ జాతీయ రహదారిని నిర్మించనున్నారు. కల్వకుర్తి–నంద్యాల–జమ్మలమడుగు మీదుగా 167కే జాతీయ రహదారి ఏర్పాటు కానుంది. ఓర్వకల్లు మండలం సోమయాజుల పల్లె నుంచి డోన్ వరకు 340బీ జాతీయరహదారి పనులు వేగంగా సాగుతున్నాయి. జాతీయ రహదారులను ఒకదానికొక్కటి అనుసంధానిస్తే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ నుంచి దేశంలోని ఏ ప్రాంతానికైనా ఎయిర్ కార్గో, రైల్వే కార్గో, రోడ్డు కార్గో ద్వారా ఉత్పత్తులను తరలించడానికి, ముడి సరుకు కొనుగోలు చేసి తీసుకొచ్చుకోవడానికి అనువుగా ఉంటుంది.

త్వరలోనే సర్వే పనులు



ఓర్వకల్లు పారిశ్రామికంగా ఎంతో వృద్ధి చెందుతోంది. ఇప్పటి వరకు ఈ ప్రాంతానికి రైల్వే లైన్ లేదు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం రైల్వే లైన్ మంజూరు చేసేందుకు అంగీకరించింది. దూపాడు నుంచి ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు కొత్త రైల్వే లైన్ ఉంటుంది. త్వరలోనే సర్వే పనులు మొదలు పెట్టేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.

–డాక్టర్ జి.సృజన, కలెక్టర్, కర్నూలు

హబ్‌పై సీఎం ప్రత్యేక దృష్టి



ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే నీటి వసతిని కల్పించే పనులు కొనసాగుతున్నాయి. కొత్త రైల్వేలైన్ వస్తే అతి తక్కువ సమయంలో ఈ ప్రాంతం పారిశ్రామికంగా వృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుంది. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌పై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

–పి.రామకృష్ణారెడ్డి, ఐలా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీల్లో భాగ్యనగరం విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో దొర్నిపాడు మండలం భాగ్యనగరం జిల్లా పరిషత్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చాటారు. డిసెంబర్ 31వ తేదీ నుంచి జనవరి 5 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం బీటల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 67వ జాతీయ తైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో బాల,బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక రజతం, మూడు కాంస్య పతకాలు దక్కాయి. భాగ్యనగర గ్రామానికి చెందిన ఆకుల సమీర, అదే పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి రాముడు పతకాలు అందుకున్నారు. ఇద్దరు క్రీడాకారులతో పాటు ప్రోత్సహించిన పీడీ శ్రీధర్‌ను సోమవారం డీఈఓ సుధాకర్‌రెడ్డి, డీప్యూటీ డీఈఓబేగ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం నాయకులు నాగరాజు, రవికుమార్, ఉపాధ్యాయలు ఉన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

నంద్యాల(న్యూటౌన్): సంక్రాంతి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ సుధాకర్‌రెడ్డి సోమవారం హెచ్చరించారు. ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత అన్ని ప్రైవేటు పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవులు ప్రకటించామన్నారు. అన్ని స్కూళ్లలో సెలవు దినాలలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఉపాధ్యాయులు కూడా సెలవు దినాలలో ఎలాంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు.

స్థిరంగా ఎండు మిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో ఎండు మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. సోమవారం సూపర్–10, తేజ్, నంబర్–5 రకాల సరకు కొనుగోళ్లు జరిగాయి. సూపర్–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.18,400, మధ్యస్థ ధర రూ.16,200, కనిష్ఠ ధర రూ.14,000 పలికింది. ఇదే రకం తాలుకాయ క్వింటాలు గరిష్ఠ ధర రూ.8,000, మధ్యస్థ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.6,000గా నమోదైంది. ఇక తేజ్ రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.18,400, మధ్యస్థ ధర రూ.18,300, కనిష్ఠ ధర రూ.14,300గా ట్రేడ్ అయ్యింది. మరోవైపు సూపర్–5 జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.17,500, మధ్యస్థ ధర రూ.17,000, కనిష్ఠ ధర రూ.14,900గా పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు అసెంబ్లీ ఎస్టిమేట్ కమిటీ పర్యటన

కర్నూలు(సెంట్రల్): అసెంబ్లీ ఎస్టిమేట్ కమిటీ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నది. కమిటీ చైర్మన్ వి.కళావతి ఆధ్వర్యంలో సభ్యులు ఉదయం మంత్రాలయం వెళ్లి శ్రీరాఘవేంద్ర స్వామిని దర్శించుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు కలెక్టరేట్‌లో జరిగే అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారు. వ్యవసాయం, ఇరిగేషన్, పంచాయతీరాజ్ విభాగాల్లో ప్రభుత్వం నుంచి మంజూరైన నిధుల వ్యయాలపై సమావేశంలో ఆడిట్ నిర్వహిస్తారు.

ముగిసిన వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పెంపు సంబరాలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. రెండు జిల్లాల్లోనూ వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పెంపు సంబరాలు పండుగ వాతావరణంలో జరిగాయి. సోమవారం సంబరాలు ముగిశాయి. కర్నూలు జిల్లాలో 2,48,072 పింఛన్లు ఉండగా.. 2,05,924 పింఛన్లు పంపిణీ చేశారు. కర్నూలు, మద్దికెర, దేవనకొండ, కౌతాళం, ఆస్పరి, పెద్దకడుబూరు, క్రిష్ణగిరి, చిప్పగిరి, సి.బెళగల్, గోనెగండ్ల మండలాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఆలస్యంగా మొదలు కావడం వల్ల 10.66 శాతం నుంచి 87 శాతం వరకు ఉంది. పత్తికొండ నియోజకవర్గంలో మిగిలిపోయిన మండలాల్లో సోమవారం పెన్షన్ కానుక పెంపు సంబరాలు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగాయి.

- నంద్యాల జిల్లాలో పింఛన్ల పంపిణీ 86.28 శాతం ముగిసింది. మొత్తం పింఛన్లు 2,24,228 ఉండగా.. 1,93,470 పింఛన్లు పంపిణీ చేశారు. నందికొట్కూరు, మహానంది, పగిడ్యాల, శ్రీశైలం, చాగలమర్రి, ఉయ్యాలవాడ, నందికొట్కూరు అర్బన్, దొర్నిపాడు, ఆత్మకూరు ప్రాంతాల్లో మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీలో గణనీయమైన ప్రగతి ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా వేలాది మంది పింఛన్లు పొందాల్సి ఉండటంతో పంపిణీ గడువును పొడిగించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సేవల్లో లోపం ఏర్పడితే అధికారులకు జరిమానా

- విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సేవల్లో లోపం ఏర్పడితే సంబంధిత అధికారులకు జరిమానా విధిస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు. సోమవారం విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్ డివిజన్‌లలోని డీఈ, ఏడీఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ... రైతు నేస్తం కింద 11 రోజుల్లోనే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయాలన్నారు. గడువు లోపు సంబంధిత విద్యుత్ ఇంజినీర్లు ఎస్టిమేట్లు జనరేట్ చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక లోడ్ ఉంటే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. డీఈలు వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు పాల్గొన్నారు.

క్షేత్ర పరిధిలో రహదారుల విస్తరణకు ప్రణాళిక



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్మన్ చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర సందర్శనకు రోజురోజుకు భక్తుల సంఖ్య పెరుగుతున్న కారణంగా అవసరమైన చోట్ల రహదారులు విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలయ మాఢవీధిలో వేస్తున్న బీటీ రోడ్డు, ఇటీవల తొలగించిన ఏ1 క్యాంటీన్ ప్రాంతాన్ని, ఆలయ దక్షిణగోపురం ఎదురుగా భక్తులు వేచి ఉండే గదికి మరమ్మతులు, రంగుల పనులను పరిశీలించారు. ఏనుగుల చెరువుకట్ట ప్రాంతంలో ల్యాండ్ స్కేపింగ్, గార్డెనింగ్‌తో సుందరీకరణ పనులకు , ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ సమీపంలో కళామందిరం ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వన్యప్రాణులు క్షేత్రపరిధిలోకి రాకుండా తగు రక్షణ చర్యలతో పాటు కంచెను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లు వి.రామకృష్ణ, జి.మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీపీడీపీపై నేడు, రేపు శిక్షణ

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) రూపకల్పనపై మంగళ, బుధవారాల్లో ఎంపీడీఓలు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈఓఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు సోమవారం తెలిపారు. గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధికి జీపీడీపీని తయారు చేయాల్సి ఉందన్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రపంచ బ్యాంక్ బృందం నేడు శ్రీశైలం ప్రాజెక్ట్ సందర్శన

శ్రీశైలంప్రాజెక్ట్: నీలం సంజీవరెడ్డి సాగర్ శ్రీశైలం ప్రాజెక్ట్ డ్యామ్‌ను మంగళవారం ప్రపంచ బ్యాంక్ బృందం పరిశీలించనున్నట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఇప్పటికే ఢిల్లీ నుంచి ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు వైకె హంద, వినోద్‌వర్మ, సెంట్రల్‌వాటర్ కమిషన్ సభ్యులు అఖిలేష్ ఆర్థర్ సున్నిపెంటలోని ఏపీజెన్‌కో గెస్ట్‌హౌస్‌కు సోమవారం రాత్రి చేరుకున్నారు. మంగళవారం సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్, వాటర్‌రిసోర్స్ డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారులు మంగళవారం శ్రీశైలం డ్యామ్‌కు చేరుకోనున్నారు. శ్రీశైలం జలాశయానికి గతంలో రెండు పర్యాయాలు వరద ముంచెత్తడంతో డ్యామ్‌లోని కొన్ని బ్లాక్‌లు దెబ్బతినడంతో పాటు ప్లంజ్‌పూల్ ప్రాంతంలో భారీ గోతులు కూడా ఏర్పడినట్లు డ్యామ్‌పరిసర ప్రాంతాల్లో పటిష్టతకు మరిన్ని పనులు చేయవలసిన అవసరం ఉందని గతంలో నిపుణుల బృందం ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. డ్యామ్‌వద్ద ఈ పనులు చేపట్టాలంటే సుమారు రూ.150 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. ఈ నిధులను సమకూర్చేందుకు ప్రపంచ బ్యాంక్ బృందం శ్రీశైలం జలాశయాన్ని సందర్శించి పరిశీలించనున్నది.

తల్లిదండ్రులను విస్మరించిన కొడుకులకు చెంపపెట్టు

- కుమారుల నుంచి భూముల హక్కును రద్దు చేసిన ఆర్డీఓ వెంకటరెడ్డి



వృద్ధ దంపతులకు పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

డోన్ టౌన్: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను విస్మరించిన కొడుకులకు అధికారులు సరైన గుణపాఠం చెప్పారు. తల్లిదండ్రుల నుంచి పొందిన ఆస్తి హక్కును రద్దు చేస్తూ డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఈ ఘటన చోటు చేసుకుంది. డోన్ సబ్ డివిజన్ పరిధిలోని బేతంచెర్ల మండలం సీతారామాపురం గ్రామానికి చెందిన చిన్నమ్మగారి వెంకటేశ్వర్లు, నాగమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. వీరికి 8 ఎకరాల పొలం ఉండగా తల్లిదండ్రుల నుంచి కుమారులు వారి పేర్ల మీద ఆన్‌లైన్ చేయించుకున్నారు. కొన్నాళ్ల తర్వాత వృద్ధ తల్లిదండ్రులను ముగ్గురు విస్మరించడంతో వారి జీవనానికి కష్టతరంగా మారింది. వృద్ధులు ఈ విషయంపై ఆర్డీఓ కార్యాలయంలో గతంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన అధికారులు కుమారులకు నచ్చజెప్పినా పట్టించుకోలేదు. ఈ మేరకు జీవో నెంబరు 2011 ప్రకారం చట్ట రీత్యా తల్లిదండ్రుల పాలన మరిచిన వారి నుంచి ఆస్తి వెనుక్కు ఇప్పించవచ్చు. దీంతో ముగ్గురు కుమారులకు భూమిపై ఉన్న హక్కును రద్దు చేసి తల్లిదండ్రులకు ఆ ఆస్తిని స్థిర పెట్టాలని ఆర్డీఓ వెంకటరెడ్డి ఉత్తర్వులు జారీ చేస్తూ బేతంచెర్ల తహసీల్దార్‌ను ఆదేశించారు.

మూడు కేసుల్లో ఇలా..

ఈ సందర్భంగా ఆర్డీఓ వెంకటరెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను విస్మరించరాదని, చట్టం లోబడి ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో కూడా తల్లిదండ్రుల ఆస్తులను తీసుకొని విస్మరించగా వారి ఫిర్యాదు మేరకు మూడు కేసుల్లో ఆస్తి హక్కులను రద్దు చేశామని గుర్తు చేశారు. ఎవ్వరైనా ఈలాంటి సంఘటనలకు పాల్పడితే భవిష్యత్‌లో కూడా వారి వద్ద నుంచి చట్టం ప్రకారం ఆస్తిని తిరిగి తల్లిదండ్రులకు అప్పగిస్తామని హెచ్చరించారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- డీఆర్‌ఓ పుల్లయ్య

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య అధికారులను సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ స్పందన అర్జీలు ఒక్కటి కూడా బియాండ్ ఎస్‌ఎల్‌ఏ లోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. వినతుల పరిష్కారానికి అధికారులు పూర్తి స్థాయి దృష్టి సారించాలన్నారు. స్పందనలో వచ్చిన 265 అర్జీలను ఆయా శాఖల అధికారులకు రెఫర్ చేశామన్నారు.

వినతుల్లో కొన్ని..

- ఆళ్లగడ్డ మండలం బాచేపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 237/1లో తనకు పొలం ఉందని, రీ సర్వే అనంతరం వెబ్ ల్యాండ్‌లో తక్కువగా చూపిస్తుందని న్యాయం చేయాలని సంజామల మండలం వసంతాపురం గ్రామానికి చెందిన రమేష్ .. డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.
- కొలిమిగుండ్ల మండలం నందిపాడు గ్రామంలో తన భూమిని గ్రామానికి చెందిన సింగారెడ్డి అనే వ్యక్తి ఆన్‌లైన్ చేయించుకున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరుతూ కర్ణమయ్య అనే వ్యక్తి అర్జీ అందజేశారు.



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ పుల్లయ్య

- రాష్ట్రంలోని 20 లక్షల మంది వికలాంగులకు పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని, జిల్లాలోని అర్హులు అయిన దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలను ఏటువంటి షరతులు లేకుండా మంజూరు చేయాలని కోరుతూ నంద్యాల జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గంగాధర శెట్టి జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు.

భక్తి తోవ.. ఉచిత సేవ

- మల్లన్న ఆర్జిత సేవల్లో తరిస్తున్న సామాన్య భక్తులు
- తెల్లరేషన్‌కార్డు భక్తులకు ప్రతినెల ఉచితసేవలో అవకాశం
- ఇప్పటికి 8 సేవల నిర్వహణ



మహామృత్యుంజయ హోమంలో పాల్గొన్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: సామాన్య భక్తులు స్వామిఅమ్మవార్ల సేవలో తరించేలా శ్రీశైల దేవస్థానం చేపట్టిన ఉచిత సేవా కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. అభిషేక ప్రియుడైన శ్రీశైల మల్లన్నకు దేవస్థానం ఆర్జిత సేవలు నిర్వహిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన భక్తులు కూడా స్వామి అమ్మవార్ల ఆర్జితసేవలను ఉచితంగా నిర్వహించుకునేలా ట్రస్ట్‌బోర్డు నిర్ణయం తీసుకోవడంతో సామాన్యులు మల్లన్న సేవలో తరిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ 20న ఉచిత సేవలు అందుబాటులోకి రాగా ఇప్పటి వరకు ఎనిమిది ఆర్జితసేవలను భక్తులు నిర్వహించుకున్నారు. శ్రీశైల దేవస్థానం 23 రకాల సేవలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి సేవకు దేవస్థానం ధర నిర్ణయించింది. సామూహిక కుంకుమార్చన రూ. 1,000, మృత్యుంజయహోమం రూ. 1,500, గణపతిపూజ రూ. 1,016, చండీహోమం రూ.1,500, శ్రీస్వామిఅమ్మవార్ల కల్యాణం రూ.1,000, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం రూ.1,500, రుద్రహోమం రూ. 1,500 ఇలా సేవలకు ధర నిర్ణయించారు. ఏడాదిలో ప్రతి మాసంలో విశిష్టతను బట్టి ఆ మేరకు ఉచిత సేవను నిర్ణయించి భక్తులకు అవకాశం కల్పిస్తున్నారు. దేవస్థానం తెల్లరేషన్‌కార్డు కలిగిన భక్తులకు ప్రతి నెలలో ఒక రోజు స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జిత సేవను ఉచితంగా నిర్వహించుకునేలా భక్తులకు అవకాశం కల్పించింది. ప్రతి నెలలో 250 టికెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. గతేడాది ఏప్రిల్ 25న సామూహిక కుంకుమార్చన, మే 12న మృత్యుంజయ హోమం, ఆగస్టు 25న శ్రావణ వరలక్ష్మీ వ్రతం, సెప్టెంబర్ 18న గణపతిపూజ, అక్టోబరు 27న చండీహోమం, నవంబరు 30న స్వామి అమ్మవార్ల కల్యాణం, డిసెంబరు 27న మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించుకున్నారు. అలాగే ఈ ఏడాది జనవరి 25న రుద్రహోమం, ఫిబ్రవరి 16న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించుకోనున్నారు. సామూహిక ఆర్జిత సేవల నిర్వహణ అనంతరం సేవాకర్తలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా వృద్ధమల్లికార్జున స్వామివారి స్పర్శదర్శనంతో పాటు భ్రమరాంబాదేవి అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు.

సామాన్య భక్తులు సైతం ఆర్జితసేవల్లో పాల్గొనేలా

హిందూ ధర్మప్రచారాన్ని ప్రజలకు మరింత దగ్గర చేసే క్రమంలో భాగంగా సామాన్య భక్తులు సైతం స్వామిఅమ్మవార్లకు నిర్వహించే ఆర్జితసేవల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించాం. ప్రతినెలలో ఒకరోజు ఓ ఆర్జిత సేవను భక్తులు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశాం. ట్రస్ట్‌బోర్డు ఏర్పాటు అయినప్పటి నుంచి సామాన్య భక్తులకు వసతి, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడంతో పాటు వివిధ ఆర్జిత సేవల్లో కూడా భక్తులు ఉచితంగా పాల్గొనేలా పలు నిర్ణయాలు తీసుకున్నాం. ఇప్పటికే సామాన్య భక్తుల కోసం మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనాన్ని ఉచితంగా కల్పిస్తున్నాం. సామాన్య భక్తులకే క్షేత్రంలో పెద్దపీట వేసేందుకు ట్రస్ట్‌బోర్డు కృషి చేస్తోంది.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్

పోస్టులన్నీ భర్తీ.. సేవలన్నీ సంతృప్తి

- వైద్య ఆరోగ్య శాఖలో 2,000 మందికి పైగా ఉద్యోగుల నియామకం
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో 385 మందికి ఉద్యోగాలు
- రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు
- వైద్యుల పోస్టుల భర్తీ కారణంగా మెడికల్ కళాశాలలో అదనపు పీజీ సీట్ల మంజూరు

కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చింది. ఏ ఒక్క పోస్టు ఖాళీగా ఉండకూడదన్న ఉద్దేశంతో ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు విడుదల చేస్తూ వచ్చింది. వీటితోపాటు ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన అదనపు పోస్టులనూ సృష్టించి మరీ భర్తీ చేసింది. జిల్లాలో వెయ్యికి పైగా ఉన్న వార్డు/గ్రామ సచివాలయాల్లో ఏఎన్ఎంలను నియమించి వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించింది. వీరు సచివాలయాల పరిధిలో ఆరోగ్య కార్యక్రమాలను పర్యవేక్షించడమే గాక ప్రాథమిక చికిత్సను సైతం అందిస్తున్నారు. గ్రామాల్లో వారి పరిధిలోకి వచ్చే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు, ఆరోగ్యశ్రీ సేవలు దగ్గరుండి మరీ చూసుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 600 మందికి పైగా బీఎస్సీ నర్సింగ్ విద్యను పూర్తి చేసిన నర్సులు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లుగా వైద్యుల పాత్ర పోషిస్తున్నారు. ఆయా గ్రామాలకు వైద్యపరంగా వారే పెద్ద దిక్కుగా మారారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే గ్రామస్తులు వారి వద్దకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఆరోగ్య సమస్య వారి పరిధిలో లేకపోతే టెలీమెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్రంలోని టెలీమెడిసిన్ హబ్‌కు వీడియోకాల్ చేసి మరీ వైద్యం అందేలా చేస్తున్నారు.



కర్నూలు మెడికల్ కాలేజీ



ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అభ్యర్థులు(ఫైల్)

వైద్యారోగ్యశాఖలో 2వేల పోస్టుల భర్తీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిత్యం ఏదో ఒక నోటిఫికేషన్‌కు సంబంధించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియ గత మూడేళ్లుగా కొనసాగుతూనే ఉంది. జిల్లాలో మొత్తం 44 అర్బన్‌హెల్త్ సెంటర్లలో ఒక్కో దాంట్లో రెండు స్టాఫ్‌నర్సు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్,ఒక ఎల్‌జీఎస్ కలిపి మొత్తం 308 పోస్టులు భర్తీ చేశారు. అలాగే ఎస్ఎన్‌సీయూల్లో 28 స్టాఫ్‌నర్సు, 29 ఎన్‌బీసీయూ స్టాఫ్‌నర్సు, నాలుగు సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులు భర్తీ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా 203 స్టాఫ్‌నర్సు, 100 మెడికల్ ఆఫీసర్, 96 స్టాఫ్ నర్సు, 22 ల్యాబ్‌టెక్నీషియన్, 26 ఎంఎన్‌ఓ, 925 సచివాలయ ఏఎన్ఎం, 74 ఎఫ్ఎన్‌వో,8 ఎస్ఏడబ్ల్యూ పోస్టులు భర్తీ అయ్యాయి.



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

కేఎంసీలో126 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైద్యుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ముందుగా దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్న వైద్యులను బదిలీ చేసింది. అనంతరం అర్హులైన వైద్యులకు పదోన్నతులు కల్పించింది. ఇందులో భాగంగా 32 మందిని అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా, 22 మందిని అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతులు ఇచ్చింది. ఖాళీగా ఉన్న స్థానాల్లో వారిని భర్తీ చేసింది. ఈ క్రమంలో గతంలో కర్నూలు నుంచి బదిలీ అయిన వారు తిరిగి పదోన్నతిపై ఇక్కడికే వచ్చారు. దీంతో పాటు ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసింది. ఈ యేడాది 126 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నూతన వైద్యులు కర్నూలు మెడికల్ కాలేజీలో అడుగు పెట్టారు. దీంతో కేఎంసీలో ప్రొఫెసర్లు 73, అసోసియేట్ ప్రొఫెసర్లు 69, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 226 మంది ఉన్నారు. ఫలితంగా ఒకేసారి ఆయా విభాగాలకు 45 పీజీ సీట్లు అదనంగా మంజూరయ్యాయి. ఇందులో రెండు సూపర్‌స్పెషాలిటీ విభాగాలు కూడా ఉన్నాయి. వైద్యులతో పాటు మూడు డేటా ఎంట్రీ ఆపరేటర్, 16 ల్యాబ్‌టెక్నీషియన్, ఒక ఫార్మాసిస్టు, నాలుగు ల్యాబ్ అటెండెంట్, ఒక ఎఫ్ఎన్‌వో, ఒక ఎంఎన్‌వో, రెండు ఆయా, ఆరు సబార్డినేట్, ఒక స్వీపర్ పోస్టులనూ భర్తీ చేశారు.

పెద్దాసుపత్రిలో నియామకాలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కనీవినీ ఎరుగని రీతిలో 2021సంవత్సరంలో 385 పోస్టులు వివిధ కేడర్లలో భర్తీ అయ్యాయి. అందులో స్టాఫ్ నర్సు 298, గ్రేడ్–2 ఫార్మాసిస్టు 15, రిసెప్షనిస్టు కమ్ క్లర్క్ 3, చైల్డ్ సైకాలజిస్టు 1, ఫిజియోథెరపిస్ట్ 2, థియేటర్ అసిస్టెంట్ 6, గ్రేడ్–2 ల్యాబ్‌టెక్నీషియన్ 19, రేడియోగ్రాఫర్ 1, డేటా ఎంట్రీఆపరేటర్ 3, బయోమెడికల్ ఇంజనీర్ 1, రేడియేషన్ సేఫ్టీ ఆఫీసర్ 1, కార్డియాలజీ టెక్నీషియన్ 1, డెంటల్ టెక్నీషియన్ 1, డార్క్‌రూమ్ అసిస్టెంట్ 4, అసిస్టెంట్ ఎలక్ట్రికల్ 1, ఎక్స్‌రే అటెండెంట్ 1, ఆప్టోమెట్రిస్ట్ 1, కేథలాబ్ టెక్నీషియన్ 2, స్పీచ్‌థెరపిస్ట్ 2, ఎంఆర్ఐ టెక్నీషియన్ 2, సీటీ టెక్నీషియన్ 2, డయాలసిస్ టెక్నీషియన్ 5, ఆడియోమెట్రి టెక్నీషియన్ 1, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ 4, స్ట్రెచ్చర్ బేరర్ 6, అటెండర్ 2 పోస్టులున్నాయి.

చరిత్రలో ఎప్పుడూ జరగలేదు



నా 35 ఏళ్ల సర్వీసులో ఎన్నడూ ఇలా పోస్టుల భర్తీ జరగలేదు. ఇది ఒక చరిత్ర. వందలాది పోస్టులను ఒకేసారి ఏ ప్రభుత్వమూ భర్తీ చేయలేదు. అది ఈ ప్రభుత్వం చేయగలిగింది. ఒక్క పోస్టు ఖాళీగా ఉన్న వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికీ అలాగే జరుగుతోంది. ఎప్పటికప్పుడు మాకు నూతన వైద్యులు వస్తూనే ఉన్నారు. ఫలితంగా అన్ని పోస్టులు భర్తీ అయి ఎన్ఎంసీ నిబంధనల మేరకు పీజీ సీట్లు పెరుగుతున్నాయి.

–డాక్టర్ పి. సుధాకర్, ప్రిన్సిపల్, కేఎంసీ, కర్నూలు

రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది



ఆసుపత్రి చరిత్రలో నాకు గుర్తుండి ఎప్పుడూ ఇన్ని పోస్టులు భర్తీ కాలేదు. ఏ విభాగంలోనూ ఖాళీలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. ఆయా విభాగాలకు అవసరమైన పరికరాలనూ సమకూరుస్తోంది. ఫలితంగా అన్ని విభాగాల్లో స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ పీజీ సీట్లు పెరిగాయి, కొత్తవి మంజూరయ్యాయి. ఫలితంగా రోగులకు మెరుగైన వైద్యం అందుతోంది.

–డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

అన్ని పోస్టులూ భర్తీ అయ్యాయి



ఒకప్పుడు చిన్న జబ్బు చేసినా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, సీహెచ్‌సీకి, జిల్లా కేంద్రానికి వచ్చేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సాధారణ జబ్బులన్నింటికీ గ్రామస్థాయిలోని విలేజ్ హెల్త్‌క్లినిక్‌లోనే పరిష్కారం లభిస్తుంది. జిల్లాలో 600లకు పైగా విలేజ్ హెల్త్‌క్లినిక్‌లలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు వైద్యసేవలు అందిస్తున్నారు. పెద్ద జబ్బు వస్తేనే వారు పెద్దాసుపత్రికి వస్తున్నారు. ఈ మేరకు గ్రామస్థాయిలో అన్ని పోస్టులూ భర్తీ అయ్యాయి. ఎక్కడా పోస్టులు ఖాళీలు లేకుండా తీసుకున్న చర్యల ఫలితంగానే ఇది సాధ్యమైంది.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌వో, కర్నూలు

తెలుగులో తీర్పు

- మాతృభాషపై అభిమానాన్ని చాటుకున్న న్యాయమూర్తి



న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి

కర్నూలు (లీగల్): తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఓ న్యాయమూర్తి రెండు రోడ్డు ప్రమాద వాజ్యాలలో తెలుగులో తీర్పు చెప్పి తన భాషాభిమానం చాటుకున్నారు. జిల్లా 7వ అదనపు న్యాయస్థానంలో దాఖలైన రెండు వేర్వేరు వ్యాజ్యాలను విచారించిన న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి తన తీర్పును తెలుగులో వెల్లడించారు. మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు మిరప పంటను 2022 సంవత్సరం ఫిబ్రవరి 9వ తేదీన అదే గ్రామానికి చెందిన కె.స్వామిరెడ్డి అనే వ్యక్తి బొలెరో వాహనంలో గుంటూరు మార్కెట్‌కు తరలించి అమ్ముకున్నాడు. అదే వాహనంలో 2022 సంవత్సరం ఫిబ్రవరి 11వ తేదీ తిరిగి గ్రామానికి వస్తుండగా నందికొట్కూరు సమీపంలోని దామగట్ల గ్రామం వద్ద ఉదయం 4:30 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు వేగంగా ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో రైతు ఆంజనేయులు, వాహన యజమాని ఇద్దరూ మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులు వేర్వేరుగా న్యాయస్థానం ఆశ్రయించారు. వారి ఫిర్యాదులను విచారించి రైతు ఆంజనేయులు కుటుంబానికి రూ.23.75 లక్షలు, స్వామిరెడ్డి కుటుంబానికి రూ.18.40 లక్షలు 7.5 శాతం వడ్డీతో ఏపీఎస్‌ఆర్టీసీ వారు నెల రోజుల్లో చెల్లించాలని న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి తన ఆదేశాల్లో పేర్కొన్నారు. గత ఏడాది కూడా తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగులో తీర్పు చెప్పారు. ఈ ఏడాది కూడా మాతృభాషపై అభిమానాన్ని చాటుకున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో సోమవారం చూచి రా తలకు పాల్పడిన ఏడుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఆచార్య నాగస్వరం నరసింహులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్షకేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నా యని తెలిపారు. ఉదయం సెషన్‌లో జరి గిన ఐదో సెమిస్టర్ పరీక్షకు 2,362 మందికి గాను 2,122 మంది హాజరు కాగా 240 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షకు 11,145 మందికి 10, 025 మంది హా జరు కాగా 1,120మంది గైర్హాజరయ్యారని తెలిపారు.కర్నూలు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాలలో ముగ్గు రు, పత్తికొండ విజయ సాయి డిగ్రీ కళాశాలలో ఇద్దరు,కోడుమూ రు సాయి రామ్ డిగ్రీ కళాశాల, ఆళ్లగడ్డ అనంత డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

కర్నూలు: పంచలింగాల రోడ్డులో జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు గ్రామానికి చెందిన కృష్ణమూర్తికి కొడుకు, కూతురు సంతానం. కుమారుడు భరత్ కుమార్ (22) పుల్లారెడ్డి కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి కర్నూలుకు వస్తుండగా పంచలింగాల రోడ్డులోని బీఆర్ రెడ్డి ఫ్యాక్టరీ వద్ద బైకు అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- స్పందనలో బాధితుడి ఫిర్యాదు

కర్నూలు : హైదరాబాదులోని డిలైట్ కంపెనీలో డివోప్స్ ఉద్యోగం ఇప్పిస్తానని వైఎస్సార్ జిల్లాకు చెందిన ఆవూరి వెంకటేష్ సీనియర్ ఎక్స్‌పీరియన్స్ ఉందని టెలిగ్రామ్ యాప్‌లో పరిచయం చేసుకుని ఫోన్‌పే ద్వారా రూ.25 వేలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు గణేష్ నగర్‌కు చెందిన జనార్దన్ ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ టి.సర్కార్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనకు వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 123 ఫిర్యాదులు వచ్చాయి. చట్టపరిధిలో వాటిపై విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అడిషనల్ ఎస్పీ హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- నందవరం మండలం మిట్ట సోమాపురం గ్రామ శివారులో ఉన్న పొలంలో పండిన పత్తి, మిరపతో పాటు పైపులు, మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన శేషన్న ఫిర్యాదు చేశారు.



స్పందనలో అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బాధితులు

- తుకారం అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి మునగాలపాడు గ్రామ పరిధిలోని శ్రీలక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో ప్లాట్లకు 2008 సంవత్సరం నుంచి కంతుల ప్రకారం డబ్బులు కట్టించుకుని పూర్తి అయిన తర్వాత రశీదులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేశాడని కర్నూలు ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన వీరన్న, యల్లప్ప ఫిర్యాదు చేశారు.
- ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో క్లర్కు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన లతీఫ్ నమ్మించి అందుకు రూ.3 లక్షలు ఖర్చు అవుతుందని రూ.20 వేలు అడ్వాన్స్‌గా తీసుకుని మోసం చేశాడని హొళగుంద మండలానికి చెందిన జేబుల్లా ఫిర్యాదు చేశారు.
- ఆస్తిలో వాటా అడిగినందుకు తనపై దాడి చేసి మానసికంగా, లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సి.బెళగల్ మండలం పలుకుదొడ్డి గ్రామానికి చెందిన బోయ ఈశ్వరమ్మ ఫిర్యాదు చేశారు.
- తన తండ్రి షేక్ అన్వర్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, గుర్తు తెలియని వ్యక్తులు చంపుతామని తనకు ఫోన్ చేస్తూ బెదిరించి రూ.60 వేలు తీసుకున్నారని కర్నూలు ఖండేరి వీధికి చెందిన షేక్ మహమ్మద్ గౌస్ ఫిర్యాదు చేశారు.

ఆంత్రాక్స్‌పై అప్రమత్తంగా ఉందాం

- వ్యాధి సోకిన జంతువుల మాంసం తినరాదు
- జిల్లాలోని ఎమ్మిగనూరులో వెలుగు చూసిన ఆంత్రాక్స్
- పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అధికారి రవిబాబు సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): గొర్రెలు, మేకలకు సోకే వ్యాధుల్లో ఆంత్రాక్స్ ప్రమాదకరమైనది. దీనిని నెరడు వాపు వ్యాధి, నెత్తురు కట్టు, రక్తపు వ్యాధి అని కూడా వ్యవహరిస్తారు. వివిధ ప్రాంతాల్లో ప్రతి ఏటా ఈ వ్యాధి కనిపిస్తుంది. ఇటీవల ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో ఈ వ్యాధి వెలుగుచూసింది. దీంతో పశుసంవర్ధక శాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే గ్రామంలో వ్యాధి నిరోధక టీకాలు కూడా వేసింది. జిల్లాలో వ్యాధి వెలుగు చూడటంతో గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు(99490 01430) తెలిపారు. ఆంత్రాక్స్ వ్యాధి సోకి మృతి చెందిన జీవాలను కోసినట్టయితే ఆంత్రాక్స్ సూక్ష్మ క్రిములు ఆ ప్రాంతమంతా వ్యాపిస్తాయన్నారు. ఆంత్రాక్స్ వ్యాధి సోకిన జీవాల మాంసం తింటే.. వాటి చర్మం ద్వారా ఈ వ్యాధి మనుషులకు కూడా సులువుగా సోకుతుందని పేర్కొన్నారు. పశువులకు ఈ వ్యాధి ఎలా వస్తుంది... వాటి లక్షణాలు, నివారణ పద్ధతుల గురించి ఆయన వివరించారు.

- ఆంత్రాసిస్ స్పోర్స్ మట్టిలో సైతం చాలా ఏళ్లు మనగలుగుతాయి. ఆంత్రాక్స్ స్పోర్స్‌లను పీల్చడం ద్వారా వ్యాధి వస్తుంది. ఆంత్రాక్స్ వ్యాధి బారిన పడిన జంతుమాంసాన్ని (స్పోర్స్) తీసుకోవడం వల్ల కూడా సోకుతుంది. నీటి ద్వారా కూడా ఆంత్రాక్స్ స్పోర్స్ జీవాల్లోకి వచ్చి వ్యాధిని కలగజేస్తుంది. అనారోగ్యానికి కారణమయ్యే బ్యాక్టీరియా చాలా శక్తివంతమైన టాక్సిన్లను ఉత్పత్తి చేస్తుంది.



ఆంత్రాక్స్ వ్యాధిపై గొర్రెల పెంపకందారులతో మాట్లాడుతున్న ఏడీ డాక్టర్ రవిబాబు

- ఆంత్రాక్స్ వ్యాధి సోకిన పశువును గుర్తించడం చాలా సులభం. జ్వరంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటం, నాలుక, గొంతు, మెడ వాపు కనిపిస్తుంది. వ్యాధి బారిన పడిన జంతువు గంటల వ్యవధిలోనే చనిపోతుంది. ముక్కు, నోరు, ఇతర రంధ్రాల నుంచి రక్తం వస్తుంది. జంతు కళేబరం ఉబ్బి వేగవంతంగా కుళ్లిపోతుంది.
- ఆంత్రాక్స్ వ్యాధికి చికిత్స ఉంది. వ్యాధిని త్వరగా గుర్తించి చికిత్స ప్రారంభించడం మంచిది. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమవుతుంది. పశువైద్యుల సలహా మేరకు పెన్సిలిన్, డాక్సిసైక్లిన్, ఎరిత్రోమైసిన్, సిప్రోఫ్లాక్సాసిన్ మందులు వాడితే వ్యాధి నయమవుతుంది. వ్యాధి సోకిన తర్వాత చికి త్స చేయించడం కంటే అసలు వ్యాధి రాకుండా టీకాలు వేయించడం ఉత్తమం.

విరగ్గాసిన కంది



కోవెలకుంట్ల సమీపంలో సాగు చేసిన కంది

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట ఆశలు రేకెత్తిస్తోంది. సాగు అన్ని విధాలా కలిసి రావడంతో దిగుబడులపై అన్నదాత ఆశలు పెట్టుకున్నారు. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో 2,500 ఎకరాల్లో కందిపంట సాగు చేశారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ.10 వేలు వెచ్చించారు. వాతావరణం అనుకూలించి ఈ ఏడాది కంది విరగ్గాయడంతో దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని భావిస్తున్నారు. మార్కెట్‌లో క్వింటా రూ. 10 వేల వరకు మద్దతు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఆదాయం చేకూరుతుందని రైతులు పేర్కొంటున్నారు.

– కోవెలకుంట్ల



విరగ్గాసిన కందికాయలు



కప్పట్రాళ్లలో పగులగొట్టిన కొండరాళ్లను పరిశీలిస్తున్న మైనింగ్ విజిలెన్స్ అధికారులు

కొండరాళ్లను అక్రమంగా తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): కొండరాళ్లను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేవనకొండ మండలం కప్పట్రాళ్లలో అక్రమంగా కొండరాళ్లను ధ్వంసం చేసి, ధ్వజస్తంభాలకు తరలిస్తున్నారనే సమాచారంతో జిల్లా మైనింగ్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారన్నారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నట్లు చెప్పారు.

జాతీయస్థాయి పోటీలకు యాళ్లూరు విద్యార్థిని



విద్యార్థిని నందిని అభినందిస్తున్న హెచ్ఎం

గోస్పాడు: జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు యాళ్లూరు హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని నందిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేంద్ర సోమవారం తెలిపారు. 8వ తరగతి చదువుతున్న నందిని గత నెల నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–14 విభాగంలో ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. ఈ మేరకు ఈనెల 14 నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్పూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ందన్నారు. ఈ మేరకు నందినిని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇద్దరికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తికి, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న మరో వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలుశిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. పట్టణానికి చెందిన నాగమనోజ్, పద్మావతినగర్‌లో రోడ్డుపై వచ్చే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మూడు రోజులు శిక్ష విధించారు. అదే విధంగా కోళ్ల దస్తగిరి, టెక్కె మెయిన్‌రోడ్డు నందు మద్యం సేవించి వాహనం నడుపుతుండటంతో డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడటంతో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా ఏడు రోజులు జైలు శిక్షను విధించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు కొత్తపేటలో నివాసముంటున్న సురేంద్ర భార్య శారద (40) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సురేంద్ర స్థానికంగా కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సురేంద్ర దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వీరికి ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతుండేది. సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కడుపునొప్పి తాళలేక ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కొద్దిసేపు తర్వాత భర్త కనుగొని ఇరుగుపొరుగు వారి సహాయంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె కుమారుడు గురుసాయి పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరుపుతున్నట్లు రెండో పట్టణ ఎస్ఐ ప్రేమ తెలిపారు.

క్లుప్తంగా

రేపు నందవరంలో 'వికసిత్ భారత్'



నందవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, మండల అధికారులు

నందవరం: వికసిత్ భారత్ సంకల్ప యాత్రను బుధవారం నందవరంలో నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి సత్యపాల్ సింగ్ బఘేల్ హాజరుకానున్నారని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. నందవరం ఎంపీడీఓ కార్యాలయం వెనుక భాగంలోని ఖాళీ స్థలాన్ని, గ్రామ సచివాలయం–1 ఆవరణలోని స్థలాలను మండల అధికారులు, జెడ్పీ సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమానికి మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని సూచించారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్, లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): గ్రావెల్, నాపరాయిను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, లారీని ఆదివారం రాత్రి సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. జగన్నాథగట్టు నుంచి గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను కర్నూలులో సీజ్ చేసి, యజమానికి రూ.15వేలు జరిమానా విధించామన్నారు. బేతంచెర్ల నుంచి మహారాష్ట్రకు నాపరాయి అక్రమంగా తరలిస్తున్న లారీని కె. నాగలాపురం వద్ద సీజ్ చేసి అక్కడే ఉన్న పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పామన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి పాల్గొన్నట్లు చెప్పారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామ పరిధిలోని కాలువ వద్ద సోమవారం రాత్రి పెద్దతుంబళం ఎస్ఐ చిన్నపీరయ్య, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఓ వ్యక్తి బైకుపై కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులను చూసి మోటార్ సైకిల్, కర్ణాటక మద్యాన్ని వదిలేసి పరారైనట్లు ఎస్ఐ చెప్పారు. సదరు వ్యక్తి బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ (ఏపీ21ఏజీ 9998), 90 ఎం.ఎల్. పరిమాణం ఉన్న 125 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకున్నట్లు వివరించారు.

హత్య కేసులో డీఎస్పీ విచారణ

తుగ్గలి: రెండు రోజుల క్రితం పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో జరిగిన పూజారి రాము హత్య కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఒకే తరహాలో ఏడాదిలోపు జరిగిన రెండు హత్యలపై ప్రతిష్టాత్మకంగా తీసుకున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మరోమారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై గ్రామస్తుల నుంచి ఆరా తీశారు. పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ మల్లికార్జున వెంట ఉన్నారు.